ప్రజాశక్తి
మంగళవారం 24 సెప్టెంబర్ 2024

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

బదిలీలపై గరంగరం

◆ నేతల సిఫార్సులు బుట్టదాఖలు
◆ కలెక్టరేట్‌లో ఓ అధికారి చక్రం తిప్పారన్న ఆరోపణలు
◆ నేతల ఫిర్యాదులతో అంతర్గత విచారణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే ఉద్యోగుల బదిలీలను చేపట్టింది. ఆగస్టు నెలలోనే దీనికి ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం వస్తూనే బదిలీ కావడంతో ఇది వరకు ప్రాధాన్యత పోస్టుల్లో కాకుండా ఉంటూ వచ్చిన వారందరూ ఇక తమకు ప్రాధాన్యత పోస్టులు వక్కుతాయని ఆశించారు. ఈ మేరకు నేతల సిఫార్సులకు పెద్దఎత్తున బారులుదీరారు. నేతలు కూడా తమకు అనుకూలమైన అధికారులను తీసుకొచ్చేందుకు లేఖలను ఇచ్చారు. అయితే పోస్టింగ్‌లకు వచ్చే సరికి వారు సిఫార్సులు చేసిన వారికి కాకుండా ఇతరులకు పోస్టింగ్‌లొచ్చాయి. దీంతో నేతల్లో తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతోంది. తమ సిఫార్సు లేఖలకు ప్రాధాన్యత లేదా అని అసంతృప్తితోనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు తమ సమస్యను ముఖ్య ప్రజాప్రతినిధి దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు సమాచారం. దీనిపై ఆయన ఉన్నతాధికారితో ఆరా తీయగా అది కింది స్థాయి అధికారులకే అప్పగించినట్టు ఆయన చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో బదిలీల్లో ఏమి జరిగిందన్న దానిపై విచారణ జరిపి నివేదికివ్వాలని కోరినట్టు తెలుస్తోంది.

ఒక అధికారియే చక్రం తిప్పారన్న ఆరోపణలు

ఎన్నికల సమయంలో ఇక్కడ బాధ్యతలు చేపట్టిన ఒక జిల్లా అధికారియే బదిలీల్లో మొత్తం చక్రం తిప్పారన్న ఆరోపణలున్నాయి. ప్రధానంగా రెవెన్యూలో ఉద్యోగుల బదిలీల్లో నేతలతో పనిలేదు.. తానే కోరుకున్న చోటుకు వేస్తా కదా చెప్పి అనుకూలమైన వారిని అనుకూలమైన పోస్టింగ్‌లు ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ప్రజాప్రతినిధుల్లో తీవ్రమైన అసంతృప్తికి దారితీస్తోంది. కొత్తగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమ సిఫార్సులనే ఏ మాత్రం పట్టించుకోకుండా వారికి ఇష్టం వచ్చినట్టు బదిలీలు చేయడం ఏమిటని మండిపడుతున్నారు. బదిలీల్లో కనీస ప్రాధాన్యతనివ్వకపోవడం ఏమిటని ముఖ్య ప్రజాప్రతినిధిని అడగటంతో ఆయన ఏమి జరిగిందన్న దానిపై ఆరా తీశారు. దీనిపై విచారణ చేపట్టి నివేదికివ్వాలని చెప్పడంతో బదిలీ ప్రక్రియ రసకందాయంలో పడింది. ఇప్పుడు సదరు ఉన్నతాధికారులపై ఏ రకమైన చర్యలుంటాయన్న దానిపై చర్చ నడుస్తోంది. ఎందుకంటే బదిలీల్లో కీలకంగా వ్యవహరించిన సదరు అధికారి వైసిపి ప్రభుత్వ హయంలో ఇక్కడికి వచ్చారు. ఇప్పుడూ ఆయనే కొనసాగుతున్నారు. దీంతో నేతలకు ఆయనపై అగ్రహంతోనున్నట్టు తెలుస్తోంది. ఇక ఇతర శాఖల్లోనూ కొంత మంది అధికారులు బదిలీల్లో ఇదే రకంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అన్నింటినీ పరిశీలించనున్నారు. దీంతో ఇప్పుడు జరిగిన బదిలీల్లో అయోమయం, గందరగోళం నెలకొంది.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

దూర ప్రాంతాల నుంచి ఎంతో ఆశతో వారి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కార్యాలయానికి వచ్చి అర్జీలు ఇచ్చే వారి సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 309 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణం, ఫైనాన్స్, పట్టాదారు పాసుపుస్తకాలు, దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఆయా శాఖల అధికారులు కింది సిబ్బందితో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. కోర్టు కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది కారణంగా ఏమైనా తప్పులు జరిగితే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, హౌసింగ్ పీడీ వెంకటరమణ రెడ్డి, జౌళి చేనేత అధికారి రమేష్, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, పలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో మంజూరు అయిన గహాలను పూర్తి చేయాలి

జిల్లాలో గృహాలు మంజూరు అయిన గహాలను పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 28న మన ఇళ్లు మన గౌరవం పేరిట ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపడుతోందన్నారు. 28న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాలో 205 లేఅవుట్లలో 31,449 గృహాలు మంజూరు అయ్యాయని, వీటిని 2025 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

స్వర్ణాంధ్ర విజన్‌పై సూచనలు ఇవ్వండి : కలెక్టర్ టిఎస్ చేతన్

స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్లాన్‌పై ప్రజలు తగు సూచనలు, అభిప్రాయాలు తెలపాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్లో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రజలు భాగస్వామ్యం వహించి వారి వారి అభిప్రాయాలు సలహాలు ప్రభుత్వానికి తెలపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఉద్రిక్తత

◆ బిజెపి, వైసిపి నాయకుల మధ్య ఘర్షణ
◆ రాత్రి 7గంటల వరకు కొనసాగిన టెన్షన్
◆ ఇరు పార్టీలకు సర్దిచెప్పిన పోలీసులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సబ్ జైలు వద్ద కూటమి శ్రేణులు ఆందోళన

ధర్మవరంలో ఉద్రిక్తత నెలకొంది. బిజెపి, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు ప్రత్యక్ష దాడులకు తెగబడ్డారు. సాధరణంగా మొదలైన వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పట్టణ నడిబొడ్డున కాలేజీ సర్కిల్లో మధ్యాహ్నం ప్రారంభం అయిన వివాదం రాత్రి ఏడు గంటల వరకు కొనసాగింది. ఇరు పార్టీ వారు పెద్ద ఎత్తున గుమిగూడి పరస్పర దాడులు చేసుకోవడంతో టెన్షన్ వాతావరనం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ధర్మవరం సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఉన్న వైసీపీ కార్యకర్తలను పలకరించేందుకు మాజీ శాసనసభ్యుడు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరాడు. వీరి వాహనాలు కాలేజీ సర్కిల్లోనే యుటర్న్ వద్దకు రాగానే అదే సమయంలో ఎదురుగా ఉన్న హోటల్‌లో మధ్యాహ్నం భోజనం ముగించుకుని మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ సిబ్బంది, స్థానిక బిజెపి నాయకుల వాహనాలు ఎదురుగా వచ్చాయి. రెండు వైపులా వాహనాలు తిప్పుకునే క్రమంలో రెండు పార్టీల నాయకులు వాదోపవాదాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వాహనంలో ఉండగా దానికి బిజెపి నాయకులు అడ్డుపడ్డారు. దీంతో కేతిరెడ్డి కారు డ్రైవర్ వేగంగా వాహనాన్ని ముందుకు నడిపాడు. ఈ సమయంలో ఇద్దరు బిజెపి నాయకులకు గాయాలు అయినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

కూటమి శ్రేణుల ఆందోళన

కాలేజీ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున ఘర్షణ జరుగుతుందన్న విషయం తెలుసుకున్న టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. వైసిపి నాయకులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేతిరెడ్డి వాహనంను కూటమి కార్యకర్తలు మరోసారి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆందోళన నడుమనే కేతిరెడ్డి తన సబ్‌జైలు లోపలికి వెళ్లిపోయాడు. సబ్‌జైలు ఎదుట కూటమి శ్రేణులు ఆందోళనకు దిగారు. కేతిరెడ్డి, వైసిపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ధర్మవరానికి ప్రత్యేక బలగాలు

వైసిపి, బిజెపి మధ్య ఘర్షణ తీవ్ర రూపం దాల్చడంతో పెద్ద సంఖ్యలో పోలీసులు ధర్మవరానికి చేరుకున్నాయి. అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇరు పార్టీల కార్యకర్తలను హెచ్చరించి గుంపులు లేకుండా అక్కడి నుండి పంపే ఏర్పాటు చేశారు. కేతిరెడ్డితో పాటు ఆయన అనుచరులని సాయంత్రం 7 గంటల వరకు సబ్ జైలులోనే ఉంచారు. ఇక కూటమి నేతలను ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించి వారితో చర్చలు జరిపారు. ప్రశాంతతకు సహకరించాలని కోరారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. 7గంటల అనంతరం పరిస్థితి అదుపులోకి రావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు పార్టీల ఘర్షణ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బలగాలతో పట్టణంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అధికారం పోయినా దౌర్జన్యాలు : చిలకం

వైసిపి ఎన్నికల్లో అధికారం కోల్పోయిన ఇంకా దౌర్జన్యం చేయాలని చూస్తోందని జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. వైసిపి, కూటమి శ్రేణుల ఘర్షణ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేతిరెడ్డికి గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. ఇకనైనా ఆయన మారాలని, లేకపోతే ధర్మవరం ప్రజలు మరింత గుణపాఠం చెబుతారన్నారు. ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయం సిబ్బంది హరీష్ స్పందించారు. ఘర్షణలు రేపే విధానాలకు వైసిపి నాయకులు స్వస్తి పలకాలని హితవు పలికారు.

ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు

ఇళ్ల మధ్య మురుగు.. ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ఎంజెపి పాఠశాల, శిరిడి సాయి బాబా కల్యాణ మండపాల నుంచి వంటకు వినియోగిం చిన, వృథా నీరు స్థానిక బిసి కాలనీలో ఇళ్ల మధ్యకు పెద్దఎత్తున చేరుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పాఠశాలలో వినియోగించిన వృథానీరు పక్కనే ఉన్న వంకలోకి వెళ్లేలా గతంలో పైపు లైన్ ఏర్పాటు చేశారు. అయితే ఆ పైపులు బ్లాక్ కావడంతో మురుగు నీరంతా సాయిబాబా గుడి ముందర నిల్వ ఉంటుంది. దీంతో గుడికి వచ్చే భక్తులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, బిసి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేపట్టి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరతున్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును అక్టోబర్ 7వ తేదీ వరకూ పొడిగించినట్లు ప్రిన్సిపల్ నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వండి

వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్

ప్రజాశక్తి-పెనుకొండ

తహశీల్దార్‌ను చుట్టుముట్టిన పేదలు

కోర్టు ఆదేశాలు అమలు చేసి పేదలకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ఇల్లు లేని నిరుపేదలు నిరసన చేపట్టి తహశీల్దార్‌కు వినతిపత్రం అంద జేశారు. వ్యకాసం నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని 668 సర్వే నెంబర్‌లో ఉన్న భూమిపై ఏడాది క్రితం హైకోర్టులో కేసు వేయగా నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తీర్పు వచ్చింద న్నారు. అయితే అధికారులు కోర్టు తీర్పును ధిక్కరించి కనీసం విచారణ చేయడం లేదన్నా రు. 668 సర్వే నంబర్‌లో కొట్టాలు వేసుకొని జీవనం సాగిస్తుంటే రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్రమంగా ఎన్నికల కోడ్ ఉన్నా కొట్టాలు తొలగించారని, ఆ సమయంలో తహశీల్దార్, ఎస్ఐ, నగర పంచాయతీ కమిషనర్, సబ్ కలెక్టర్‌పై కంటెంట్ ఆఫ్ కోర్టుకు వెళ్లామని వివరించారు. పేదలు తహశీల్దార్‌ను కలిసి మొరపెట్టుకోగా స్పందించిన ఆయన 15 రోజుల్లో సబ్ కలెక్టర్, మంత్రితో కలిసి పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పట్టాలెప్పుడైనా ఇవ్వండి ఆ స్థలాల్లో కొట్టాలు వేసుకొని జీవనం సాగిస్తామని పేదలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ నాయకులు నారాయణ, వెంకటరాముడు, పేదల పట్టణ కమిటీ నాయకులు షబానా, మైలార నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బ్యుటీషియన్ శిక్షణ

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళల కోసం పట్టణంలోని త్రిపుర రిసార్ట్‌లో బ్యుటీషియన్, పార్లర్ మేనేజ్‌మెంట్‌పై ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను సోమవారం డాక్టర్ గోపీనాథ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు బ్యుటీషియన్, పార్లర్ మేనేజ్‌మెంట్‌లో పది రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. మహిళల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ శిక్షణ ఉపయోగ పడుతుందన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు ఆదాయం పెంచుకుని తద్వారా జీవన ప్రమాణాలు మెరుగు పరచుకోవా లని సూచించారు. శిక్షణకు 80 మంది హాజరయ్యారని శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. మేకప్ ఆర్టిస్ట్‌గా పదేళ్ల అనుభవం ఉన్న చెన్నైకి చెందిన కరుణ శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిఎం శేఖర్, రామకృష్ణ, రామాంజనేయులు, హరీష్, రవి, సోమశేఖర్, మధు, బాల గోపాల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవ లో భాగంగా సోమవారం పట్టణంలోని కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం శుభ పరిణామన్నారు. కార్మికులు వారి కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని సరైన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కదిరి ఏరియా హాస్పిటల్ డాక్టర్లు, మునిసిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేకుండా టపాసులు నిల్వ చేస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

అనుమతులు లేకుండా టపాసులు నిల్వ చేస్తే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటామని టూటౌన్ సిఐ అబ్దుల్ కరీం హెచ్చరించారు. సోమవారం రాత్రి పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో నాగరాజు ఇంట్లో ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన రూ.40వేల విలువ జేసే టపాసులను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ పోలీసులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న టపాసులను చూపిస్తున్న సిఐ అబ్దుల్ కరీం

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన

మడకశిర రూరల్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ మడకశిర వారి ఆధ్వర్యంలో సోమవారం పట్టణం లోని విజయభారతి జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫోర్డ్ సంస్థ సిబ్బంది మాట్లాడుతూ ఎయిడ్స్ సంక్రమణ, లక్షణాలు, నివారణ జాగ్రత్తలు, మందుల గురించి వివరించారు. ఎయిడ్స్ రోగులతో ఎలా మెలగాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నవీన్‌కుమార్, దేవకుమార్, అంజి, ముకుంద, ఫోర్డ్ సిబ్బంది అశ్వత్థనారాయణ, లలిత, నాగేశ్వరి పాల్గొన్నారు.

కెవికె ఉద్యోగుల సమస్యలపై ఎంపికి వినతి

పెనుకొండ టౌన్ : పట్టణంలోని హిందూపురం ఎంపి కార్యాలయం లో సోమవారం ఎంపి బికె.పార్థసారధిని నంద్యాల జిల్లాలోని బనగానపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ ధనలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యులైన బికె.పార్థసారధికి ఆమె ఎపిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

కుమార్తె ఆచూకీ తెలపాలని వేడుకోలు

రొద్దం : తమ కుమార్తె ఆచూకీ తెలపాలని మండలంలోని చెరుకూరు గ్రామానికి చెందిన దళిత సరస్వతి, గంగాధరప్ప దంపతులు పోలీసులను వేడుకొంటున్నారు. రొద్దంలో సోమవారం గంగాధరప్ప తెలిపిన వివరాలు.. వారికి ఐదుగురు కుమార్తెలు. ఈ నెల 8వ తేదీ భార్యాభర్తలిద్దరూ కూలి పనులకు వెళ్లారు. ఆ రోజు ఇంటి నుంచి వెళ్లిపోయిన పెద్ద కుమార్తె గౌతమి తిరిగి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో ఓ అనుమానితుడిపై 9వ తేదీ రొద్దం పోలీస్‌స్టేషన్‌తో పాటు పెనుకొండ సిఐకి ఫిర్యాదు చేశారు. ఇంతవరకూ తమ కుమార్తె ఆచూకీ తెలపలేదని వాపోయారు.

కళాశాల ప్రాంగణంలో చెత్త తొలగింపు

రొద్దం : 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ మద్దిలేటి ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు, చెత్తచెదారం తొలగించి శుభ్రం చేశారు. అలాగే మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాల ఆవరణం శుభ్రం చేసి మొక్కలు నాటడం వల్ల ఆహ్లాదకర వాతావరణం నెలకొందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు వైసిపి సిద్ధమా..?

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సవాల్

ప్రజాశక్తి-మడకశిర

అమరాపురం ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణం భూమిపూజలో పాల్గొన్న ఎంపి బికె.పార్థసారధి, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

నియోజకవర్గంలో వైసిపి హయాంలోని ఐదేళ్లలో, ఈ వంద రోజుల్లో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సవాల్ చేశారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో సీసీ దారి కూడా వేయలేని వారు ఈ వంద రోజుల్లో జరిగిన అభివృద్ధిని చూసి సిగ్గుపడాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. అమరాపురం మండలంలో సోమవారం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం'లో ఎంపి బికె.పార్థసారధి, ఎమ్మెల్యే రాజు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కనీసం తాగునీటి బోర్లకు మరమ్మతులు కూడా చేయని వారు ఏం మొహం పెట్టుకొని విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. నిద్రగట్ట పంచాయతీలో సీసీ దారులకు రూ. 45 లక్షలు, తాగునీటి ట్యాంకు నిర్మాణానికి రూ. 35 లక్షలు మంజూరు చేయించామన్నారు. వక్క మార్కెట్, పరిశ్రమల ఏర్పాటు, బైపాస్ కెనాల్ నిర్మాణానికి సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అనంతరం అమరాపురం ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణం భూమిపూజలో ఎంపి బికె.పార్థసారధి, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కుంచితి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వివిఎం.పాండురంగప్ప, మండల కన్వీనర్ గణేష్, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, నాయకులు మీనాక్షిరామిరెడ్డి, కృష్ణమూర్తి, ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఎపి : ఎంపి పార్థసారధి, ఎమ్మెల్యే రాజు

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తోందని హిందూపురం ఎంపి బికె. పార్థసారధి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మడకశిర పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక సంక్షోభం ఉన్నా వంద రోజుల్లో వందకు పైగా చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. జగన్ ప్రభుత్వం రూ. 12 లక్షల కోట్ల అప్పు చేసి ఎపిని అంధకారంలోకి నెట్టిందన్నారు. అయినా పరిపాలన దక్షత, అనుభవం ఉన్న సిఎం చంద్ర బాబు ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీ వేతనాలు చెల్లిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నార న్నారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం, త్వరలో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. వారితోపాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, పట్టణ కన్వీనర్ మనోహర్ ఉన్నారు.

కబ్జా చేసిన స్థలం పేదలకు ఇప్పించిన ఎమ్మెల్యే

గత వైసిపి ప్రభుత్వంలో పట్టణ పరిధిలోని చీపులేటిలో ఇంటి స్థలాన్ని కొందరు కబ్జా చేశారని ఇటీవల బాధితులు గంగమ్మ, లక్ష్మీదేవి, గణేష్ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడి 20 రోజుల్లోనే బాధితులకు ఇళ్ల పట్టాలు తయారు చేయించారు. ఆ ఇంటి పట్టాను ఎమ్మెల్యే సోమవారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బాధితులకు అందజేశారు. దీంతో బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

స్థానిక జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 19, 20 తేదీల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. అందులో విజేత విద్యార్థులకు సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గస్థాయి పోటీలకు పంపుతామని పిడి నల్లప్ప తెలిపారు.

క్రీడా సామగ్రి కోసం పూర్వవిద్యార్థి విరాళం

చెన్నేకొత్తపల్లికి చెందిన చెన్నకేశవగౌడ్ కుమారుడు యశ్వంత్‌గౌడ్ తన జన్మదినం సందర్భంగా పాఠశాలలో క్రీడా సామగ్రి కోసం రూ. 5వేలను హెచ్‌ఎంకి అందజేశారు. తాను చదివిన పాఠశాల విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం ఈ విరాళం అందజేసినట్లు పూర్వ విద్యార్థి యశ్వంత్ గౌడ్ తెలిపారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - కదిరి టౌన్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) కదిరి ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రజల నుండి సేకరించిన బట్టలను విజయవాడలోని అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీకి పంపుతున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నిసా తెలిపారు. బాధితుల సహాయార్థం తమవంతుగా బట్టల సేకరించామని వాటిని విజయవాడ పంపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు లక్ష్మీదేవి, శారద, సుజాత, భాగ్య, సునీత, సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, నారాయణ, కృష్ణనాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

ప్రజాశక్తి - ముదిగుబ్బ

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1991-92 సంవత్సరం లో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు ఇటీవల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమం లో తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నారు. పురుష పూర్వ విద్యార్థులు మైక్ సెట్, మహిళా పూర్వ విద్యార్థులు బీరువాను అందించారు. తాము చదివిన పాఠశాలను గుర్తుంచుకొని వస్తువులు అందించిన పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్ర, రమాదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఫకద్దీన్, జగన్, రామనాయుడు, మౌళి, చంద్రకళ, శివమ్మ, శ్రీదేవి, మునిస్వామి, భీమ్లా నాయక్, ఉపాధ్యాయులు నాగరాజు, ఉమాదేవి, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A.No : 81/2023 in
E.P.No : 47/2021 in
E.P.No : 158/2020
బండ్లమూడి చిన్నమ్మి చనిపోతే ఆమె వారసులు
.. డి. హెచ్. ఆర్
1) బండ్లమూడి రాజ కుమార్
2) బండ్లమూడి యువరాజు
.. పిటిషనర్స్ / ప్రొపోజ్డ్ డి. హెచ్. ఆర్స్
వర్సస్
చింతా బాబురావు .. జె.డి.ఆర్/రెస్పాండెంట్ టు,
జె.డి.ఆర్ / రెస్పాండెంట్ చిరునామా
చింతా బాబు రావు తండ్రి చెన్నయ్య, వయస్సు 55 సంవత్సరాలు, రైల్వే ఉద్యోగి, దేవనగరం గ్రామం, కంభం మండలం, ప్రకాశం జిల్లా.
జె.డి.ఆర్ / రెస్పాండెంట్ ప్రస్తుత చిరునామా
సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే క్వార్టర్స్, పుట్టపర్తి గ్రామం, పుట్టపర్తి మండలం, శ్రీ సత్య సాయి జిల్లా.
పై నెంబరు పిటిషన్‌లో ప్రొపోజ్డ్ డి. హెచ్. ఆర్స్/పిటిషనర్లు మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ:17-10-2024న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీవకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీపరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
గిద్దలూరు
తేదీ : 16-09-2024 ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
డి. హెచ్. ఆర్స్/ పిటిషనర్స్ పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం : 9393442442

మహారాజశ్రీ అనంతపురం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.NO:37/2023
Between:
మాదిగ హనుమేష్ ...వాది
మరియు
1.అయ్యప్ప రెడ్డి, 2.గోపాల్, 3.బళ్లారి మల్లికార్జున, 4.శర్మాస్ వలి, 5.శేఖర్, 6.అయ్యప్పరెడ్డి, 7.ఆదెప్ప, 8.వన్నూర్ వలి, 9.జయప్ప, 10.రవి
...ప్రతివాదులు 1 నుండి 10
ప్రతివాదులు 7 మరియు 10 లకు నోటీసు
7వ ప్రతివాది:
ఆదెప్ప S/o బగ్గయ్య, సంకెపల్లె గ్రామం, ముదిగుబ్బ మండలం, పుట్టపర్తి, శ్రీ సత్యసాయి జిల్లా. సెల్:6303886030
10వ ప్రతివాది:
రవి S/o Not Know బెలుగుప్ప-తాండ, బెలుగుప్ప మండలం, అనంతపురం జిల్లా. సెల్:9505195600
పై కేసు నందు వాది తనను దివాలాదారునిగా డిక్లేర్ చేయమని వేసిన కేసును పై కోర్టునందు దాఖలు చేసియున్నారు. మీ యొక్క అనగా ప్రతివాదులు 7 మరియు 10లు హాజరు కొరకు పై కోర్టు వారు పై కేసును తేది 03/10/2024 నకు వాయిదా వేసి యున్నారు. కావున పై కేసులో మీకు ఏమైనా అభ్యంతరాలు వున్న యెడల పై తేదిన పై కోర్టు నందు ఉదయం 10:30 ని॥లకు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల పై అర్జీనందు మీకు పరోక్షమున గౌరవ కోర్టు వారు తీర్మాణము చేయుదురు.
(గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
డి.సి.శేఖర్, యం.పి.భార్గవి,
అడ్వకేట్స్ గుంతకల్లు.
యం.శ్రీనివాసులు,
అడ్వకేట్ అనంతపురం.
సెల్:9346983123,8019917232

In The Court of The Addl.Senior Civil Judge, Ananthapuramu
H.M.O.P No:404/2023
Between:
Polepalli Nagamani ...Petitioner
V/S
Ratnala Sreerivasulu ...Respondant
Notice to Respondant
To:
Ratnala Sreerivasulu S/o R.Venkatesulu, D.No:27/8-352/CS3, Mudireddypalli Village Hindupur Mandal, Sri Satya Sai Dist.
పిటీషనరు మీ నుంచి విడాకులు కోరుతూ పై నెంబరు పిటీషను వేయడమైనది. సదరి పిటీషను ప్రతివాది హాజరు నిమిత్తం 25/09/2024 వ తేదిన వాయిదా వేయడమైనది. ఆ దినము మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు ఎదుట ఉదయం 10:30 గం॥లకు హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవలెను. లేని పక్షమున పై పిటీషను మీ పరోక్షములో తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
S.GOPI, Advocate,
Anantapuramu. Cell:9440989424

పేరుకే ప్రజాసమస్యల పరిష్కార వేదిక ...

తహశీల్దార్ కార్యలయంలో పూర్తి స్థాయిలో అధికారులు లేని దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘంతో పాటు 14 గ్రామపంచాయతీలతో నియోజకవర్గంలోని అతి పెద్ద మండలంగా హిందూపురం మండలం విస్తరించింది. ఈ మండలంలో దాదాపు 42 వేల గృహాలతో పాటు సుమారు 2.10 లక్షల మంది జనాభా నివాసం ఉంటున్నారు. వీరిలో చాలా ఉమంది ఏదో ఒక సమస్యతో బాధపడుతుంటారు. ఆ సమస్యలను పరిష్కరిస్తారని ఎంతో ఆశతో తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడానికి వెళితే వారికి నిరాశ మిగులుతోంది. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాకపోవటంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి రెవెన్యూ అధికారులతో పాటు, మండల పరిషత్, వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఐసిడిఎస్, ఉద్యానవన శాఖ, విద్యాశాఖ తో పాటు మండల స్థాయిలో ఉన్న ప్రతి శాఖకు

అధికారులు హాజరైతే ఒట్టు ఆసక్తి కనబరచని ప్రజలు

చెందిన అధికారులు హాజరు కావాల్సి ఉంది. అయితే సోమవారం హిందూపురంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానికంగా ఉండాల్సిన రెవిన్యూ అధికారులే హాజరు కాలేదు. మండల పరిషత్, ఐసిడిఎస్, గృహ నిర్మాణ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చూడాల్సిన రెవెన్యూ అధికారులే హాజరు కాకపోవడం గమనార్హం. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని, సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అరాచకాలకు అడ్డుకట్ట వేయండి : సిపిఎం

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురం లో కొంతమంది రాజకీయ నాయకులు అరాచకాలు చేస్తున్నారని వారిని, అడ్డుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, అక్కడి పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేశు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయనతోపాటు సిఐటియు నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాళ్ల అనంతపురం గ్రామం జెకె. పల్లి రెవెన్యూ పొలంలో సర్వే నంబర్లు 50, 51, 494, 338 లోగల 16.20 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది రాజకీయ నాయకులుగా చలామణి అవుతూ దొంగ పట్టాలను సృష్టించి ఆక్రమించుకున్నారన్నారు. సమాచార చట్టం మేరకు ఇచ్చిన సమాచారంలో ఇది ప్రభుత్వ భూమి అని తెలిందన్నారు. ఆ భూమిలో పేదలు గుడిసెలు వేసుకోవడానికి వెళితే వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. ప్రభుత్వానికి సంబంధించి భూమిని అక్రమంగా ఆక్రమించుకుంటున్న వారి నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అక్కడి పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ముదిగుబ్బ మండల కార్యదర్శి పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్ బాబు, బాబ్జాన్, మహబూబ్ బాషా, ముత్తుజ, వెంగముని, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

'చెకుముకి' గోడ పత్రికలు విడుదల

ప్రజాశక్తి - కదిరి టౌన్

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మూడుదశాబ్దాలుగా చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహిస్తోందని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బి నరసారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రోడ్లు భవనాలు అతిథి గహంలో జన విజ్ఞాన వేదిక కదిరి నాయకులతో కలసి చెకుముకి పరీక్షల గోడపత్రికను విడుదల చేశారు. ఈనెల 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ 1న మండల స్థాయి, 27 న జిల్లాస్థాయి, నవంబర్ 9న రాష్ట్ర స్థాయి పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. 8, 9, 10 వ తరగతుల అన్ని యాజమాన్యాల విద్యార్థులు ఈ పరీక్షలకు అర్హులన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సహకరించమనిరాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, చిన్నారావు, శివారెడ్డి, అశ్వర్థ నారాయణ, సురేష్, హరిప్రసాద్, చంద్రశేఖర్, గౌస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. పెద్దన్న కోరారు. కొత్తచెరువు తహశీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నీలకంఠారెడ్డిని ఆయనతో పాటు విఆర్‌ఎలు సోమవారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్దన్న మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యల గురించి వివరించారు. మండలంలో మృతి చెందిన విఆర్‌ఏ కుటుంబాల్లో ఒకకరికి విఆర్‌ఎలుగా పోస్టులు ఇవ్వాలని కోరారు. అర్హులైన వారిని అటెండర్లుగాను, వాచ్‌మెన్లుగానూ ప్రమోషన్లు కల్పించాలన్నారు. స్పందించిన తహశీల్దార్ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షులు శివ ప్రసాద్, వీఆర్‌ఏలు చిన్నయ్య, భైరవుడు, ఎల్లప్ప, చెన్నకేశవులు, గంగాధర్, సాయి ప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

పారిశుధ్య కార్మికుల సేవలు విశిష్టమైనవి

ప్రజాశక్తి-హిందూపురం

పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో విశిష్టమైనవని, ప్రతి రోజూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని, వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యలయంలో పారిశుధ్య కార్మికులకు, ఇతర మున్సిపల్ కార్మికులకు జిల్లా ప్రభుత్వ అసుపత్రి మెడికల్ సూపరిటెండెంట్ రోహిల్ కుమార్ నేతృత్వంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నేత, టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్‌తో కలిసి కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కార్మికులకు వైద్యులు జక్క నరేంద్ర, రాజేష్, నందిత, డేవిడ్ రాజు, అరుణ తదితరులు రక్త పోటు, మధుమేహంతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు పలువురు కౌన్సిలర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్: పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని జానకి రామయ్య కళ్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులు ఎప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. వైద్యులు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మెడిసిన్ ఇవ్వాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటే పట్టణ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు,టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప కారాగారంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

ప్రజాశక్తి-హిందూపురం

ఉపకారాగారం గదుల్లో ఉన్న ఖైదీల కదలికలను గుర్తించేందుకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్ ఉప కారగార అధికారికి సూచించారు. సీసీ కెమెరాలు లేకపోతే ఆయా గదుల్లో ఖైదీలు ఏం చేస్తున్నారన్న విషయాలు తెలియవచ్చే అవకాశం ఉండదన్నారు. సోమవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు అధికారి అంజి నాయక్ తో ప్రస్తుతం కారాగారంలో ఉన్న ఖైదీలు ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటి నుండి జైలులో ఉంటున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేరుగా ఖైదీలతో మాట్లాడారు. వైద్యులు ప్రతివారం వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారా, సక్రమంగా వేళకు భోజనం అందిస్తున్నారా, అధికారులు ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తున్నారా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖైదీలు న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితిలో ఉంటే సబ్ జైలు అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అలా వచ్చిన దరఖాస్తులను న్యాయస్థానం పరిశీలించి ఉచితంగా కేసు వాదించేందుకు న్యాయవాదులను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి ఖైదీకి తప్పనిసరిగా న్యాయవాది ఉండేలా చర్యలు తీసుకోవాలని, న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలు ఉంటే దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని జైలు అధికారికి సూచించారు. అనంతరం ఖైదీల కోసం తయారు చేసిన భోజన పదార్థాలను పరిశీలించారు. వంటగదిని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు శుచిగా భోజన పదార్థాలను తయారు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూర అన్నారు. మండల పరిధిలోని పాముదుర్తి పంచాయతీలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఈ ఐదేళ్లలో అమలు చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని బుక్క పట్నంచెరువు, మారాల రిజర్వాయర్‌కు అతి త్వరలో కృష్ణా జలాలు తీసుకొచ్చి అన్నదాతలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలోని 195 చెరువులకు నీరందించే బాధ్యత తీసుకుంటామన్నారు.. అమడగూరు, ఓడి చెరువు ,నల్లమాడ మండలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కృష్ణ జలాలను తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తామన్నారు.

పిహెచ్‌సి తనిఖీ : పాముదుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తనిఖీ చేశారు. ప్రజలకు ఎలాంటి రకం మందులు అందుబాటులో ఉన్నాయో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుర్రంపాటి జ్యోతి, కన్వీనర్ మల్లిరెడ్డి, తహశీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీవో శ్రీనివాసులు, నాయకులు కృష్ణమూర్తి, గంగాధర్, వెంకటరాముడు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : ఎన్నికల ముందు ప్రకటించిన అన్ని పథకాలను దశలవారీగా అమలు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రెక్క మాను సచివాలయం వద్ద నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ మండలంలోని అన్ని చెరువులను హంద్రీనీవా నీటితో నింపుతామని అన్నారు. మండల పరిధిలోని కొట్లపల్లి నుంచి పోతవాళ్లపల్లి వరకు 39 లక్షల రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో రామనాయక్, ఏపిఎం సూర్యనారాయణ, ఏవో లక్ష్మీ ప్రియ, ఎంఇఒలు కృష్ణానాయక్, శ్రీనివాసులు, టిడిపి కన్వీనర్ సి కొండయ్య, వైస్ ఎంపిపి గంగోజమ్మ తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర

కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట, తదితరులు

నేరాలు ఘోరాలు

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

రైళ్లల్లో ప్రయాణికులకు మత్తుమందు ఇచ్చి దొంగతనాలకు పాల్పడే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 ల్యాప్టాప్ లతో పాటు 50 గ్రాముల బంగారం, 4 సెల్ ఫోన్లు, 895 నిద్ర మాత్రలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే సర్కిల్ ఇన్స్ పెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. నిందితుల అరెస్టు వివరాలను సోమవారం హిందూపురం పట్టణంలోని రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత కొంతకాలంగా రైళ్లల్లో దొంగతనాలు ఎక్కువ కావడంతో గుంతకల్ రైల్వే జిల్లా ఎస్పీ రాహుల్ మీనా సూచనలతో డి.ఎస్.పి హరిప్రియ పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం హిందూపురం రైల్వే స్టేషన్ లోని ఫ్లాట్ ఫామ్ -1 పై అనుమానంగా ముగ్గురు యువకులు సంచరిస్తుండగా సిబ్బంది వారిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. దీంతో అసలు విషయాలు బయటకు వచ్చాచి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోండి జిల్లా, రెండవ గ్రామానికి చెందిన రామ్ కిరణ్ రైళ్లల్లో తొలుత చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడేవాడు. క్రమంగా ఇతను తన బావమరిది మనోజ్ తో పాటు హకివుల్లాతో కలసి మాజా కూల్‌డ్రింక్‌లో నిద్ర మాత్రలు వేసి ప్రయాణికుల మాదిరిగా రైలులో ప్రయాణిస్తూ, ప్రయాణికులతో స్నేహం పెంచుకుని ఆ కూల్‌డ్రింక్‌ను తాగించి వారి వద్ద ఉన్న నగదు, నగలతో పాటు విలువైన వస్తువులను దొంగలించేవారు. ఈ నిందితులు కేవలం కర్నాటక ఎక్స్ ప్రెస్, మైసూర్ ఎక్స్ ప్రెస్ రైళ్లను ఎంపిక చేసుకుని దొంగతనాలకు పాల్పడేవారు. ఇలా చోరీ చేసిన వస్తువులన్నీ బెంగళూరులోని భనశంకరి కాలనీలో చిన్న గది అద్దెకు తీసుకుని అక్కడ ఉంచి, పంజాబ్ రాష్ట్రం లూథియానాకు చెందిన మనోజ్ సింగ్‌కు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ముగ్గురిని గుంతకల్లు రైల్వే కోర్టులో హాజరు పరుస్తామని రైల్వే సిఐ చెప్పారు. దీంతోపాటు మనోజ్ సింగ్ ను సైతం అరెస్టు చేసి మిగిలిన చోరీ సొత్తును రికవరీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిఆర్‌పిఎఫ్, ఆర్‌పిఎఫ్ ఎస్ఐలు బాలాజీ నాయక్, సాయినాథ్ రెడ్డి, ఆనందప్ప, ఎఎస్ఐ శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

లారీ కిందపడి మహిళ మృతి

ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక గాంధీ సర్కిల్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఎండలబండ వీధిలో నివాసం ఉంటున్న మల్లికార్జున, వేదవతి(42) దంపతులు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గాంధీ సర్కిల్‌లో లారీ తగలడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వేదవతి లారీ కింద పడింది. ఆమెపై లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.11లక్షల విలువజేసే టపాసులు సీజ్

ప్రజాశక్తి - పరిగి, సోమందేపల్లి

పరిగి, సోమందేపల్లి మండలాల్లో సోమవారం నిర్వహించిన సోదాల్లో రూ. 11 లక్షల విలువైన టపాసులను పోలీసులు సీజ్ చేశారు. పరిగి మండల కేంద్రంలోని ఓ ఇంట్లో గుట్టుగా దాచుకున్న రూ. 2 లక్షలు విలువచేసే టపాసులను సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాలతో మండల వ్యాప్తంగా టపాసులు అమ్మకాల నిర్వాహకులు ఇండ్లలో సోదాలు నిర్వహించగా అనుమతులు లేకుండా ఇంట్లో ఉంచుకున్న టపాసులను గుర్తించామన్నారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో తహశీల్దార్ హసీనా సుల్తానా, ఆర్ఐ సిద్దేశ్వర, వీఆర్వో మంజుల తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సోమందేపల్లిలోని వ్యాపార సముదాయాల్లో సోమవారం ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో ఇద్దరు వ్యాపారుల వద్ద పెద్ద మొత్తంలో బాణసంచా నిల్వలను గుర్తించి సీజ్ చేశారు. వాటి విలువ రూ. 9 లక్షలు ఉంటుందని, ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ సోదాల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని టీఎన్ పాలెం సమీపంలో ఏర్పాటు చేసిన పేకాటస్థావరం పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేయడంతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నుండి 70, 600 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ముదిగుబ్బ రూరల్ సిఐ శ్యామ్ రావు, పట్నం ఎస్ ఐ నరసింహులు తెలిపారు.

కర్నాటక మద్యం సీజ్

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పెద్ద రెడ్డి పల్లి లో నంజుండప్ప అనే వ్యక్తి అక్రమంగా కర్నాటక మద్యం విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. 90 ప్యాకెట్ల కర్నాటక మద్యాన్ని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లిలో జరిగిన ఘటనలో విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. విద్యుత్ శాఖలో ముదిగుబ్బ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటప్ప అనే కాంట్రాక్టర్ వద్ద ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న బుక్కపట్నం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన బోయ నరేష్ ఆదివారం 11 కెవి విధులు నిర్వహిస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గాయపడిన వ్యక్తిని స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సుంది.

సిఐకి సన్మానం

ముదిగుబ్బ : మండల కేంద్రంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న రూరల్ సిఐ శ్యాంరావుకు స్థానిక టిడిపి, సిపిఐ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు వారు సిఐని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీనివాసులు, తిప్పయ్య, రాధాకృష్ణ, తుమ్మల చెన్నప్ప ప్రసాద్ నాయక్, చల్లా రంగయ్య , దాడి తోట భాస్కర, సుధాకర్, లింగుట్ల వెంకట రాముడు, అమిలినేని రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో 'బ్లూమూన్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణ సమీపంలోని ఏర్రదొడ్డి వద్ద గల బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చారు. ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో కదిరిలో నిర్వహించిన వివిధ క్రీడలలో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు బ్లూమూన్ విద్యాసంస్థ చైర్మన్ మంచి శివశంకర్ తెలిపారు. బాలికల అండర్-14 కబడ్డి విభాగంలో ఆర్. జ్యోత్స్న. పావని అండర్ 17 విభాగంలో సమీర, పూర్ణిమ, అనూజ, అండర్-14 ఖో ఖో విభాగంలో హర్షిత, నవ్యత, జ్యోత్స్న, అండర్-17 విభాగంలో బి.ఎల్.ఎస్ దీక్షిత రెడ్డి శ్రీరెడ్డి. జి. మానస రాయల్, అండర్-14 బ్యాడ్మింటన్ విభాగంలో వర్షరెడ్డి, అండర్ 17 విభాగంలో ఎస్. పూర్ర్ణిమ, అండర్- -14 200 మీటర్ల పరుగు పందెంలో జ్యోత్స్న ద్వితీయ స్థానం, అండర్-17 200 మీటర్ల పరుగుపందెంలో బి.ఎల్.ఎస్ దీక్షిత రెడ్డి ద్వితీయ స్థానం, అండర్-17 జావలిన్‌త్రోలో ఎస్. పూర్ణిమ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు.. బాలుర విభాగంలో అండర్-14 కబడ్డీలో రేవంత్, భాను, అండర్-17లో ఎల్లేశ్వర్, హరిహర, అండర్-14 వాలీబాల్లో రేవంత్, భాను, అండర్-17 లో సాహిద్, వినిత్, అండర్-14 ఖో-ఖోలో రోహిత్, అండర్-17 లో వెంకట్ సాయి, అండర్-14 చెస్‌లో సివి. ఎస్ ప్రసాద్ రెడ్డి, మోక్షజ్ఞ, అండర్-14 హై జంప్ లో హరిహర ప్రథమ స్థానంలో, అండర్-14 జావలిన్ త్రో లో ఔషువా ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. . ఎంపిక కాబడిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించి విద్యా సంస్థకు, తల్లిదండ్రులకు, కదిరి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని విద్యాసంస్థల అధినేత మంచి శివ శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి సురేంద్ర రెడ్డి, ఇన్‌ఛార్జి మాధవ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రామాంజుల రెడ్డి, డ్యానియల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అసాంఘిక కార్యక్రమాలు, అక్రమ రవాణా, మహిళలపై అఘాయిత్యం వంటి నేరాలకు పాల్పడే ఎలాంటి వారినైనా ఉపేక్షించబోమని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ విరత్న పేర్కొన్నారు. ఈమేరకు ఆమె జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరాలతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు జిల్లాలో నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు జిల్లాలో గంజాయి జూదం ఇసుక అక్రమ మద్యం వంటి అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా రూపుమాపే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కర్నాటక సరిహద్దు పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు, గంజాయి, గాంబ్లింగ్, అక్రమ మద్యం అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటునానమని చెప్పారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న పోలీస్ సిబ్బందికి కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించి పోలీస్ స్టేషన్లను పటిష్టం చేసి సిబ్బంది ద్వారా అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తామన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ లో కూడా తమ దృష్టికి వస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కస్తున్నామని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాలు, గంజాయి వంటి వాటిపై ఇప్పటికే ధర్మవరం హిందూపురం ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, గంజాయి వాడకం తగ్గించేందుకు హిందూపురం కదిరి ధర్మవరం లాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. ధర్మవరం, గోరంట్ల, నల్లమాడ చిలమత్తూరు పెనుగొండ, ఎన్‌పి కుంట తనకల్లు, అమడగూరు, ఓడిసి, తనకల్లు ప్రాంతాలలో మద్యం అక్రమ రవాణా జరక్కుండా చర్యలు చేపడతామని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నిఘా పెంచుతామని తెలిపారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పోలీసులు ప్రజలు మధ్య స్నేహపూర్వకంగా సంబంధాలు ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. నేర సమీక్ష సమావేశాలు ఒకచోట కాకుండా రెండు మూడు ప్రాంతాల్లో నిర్వహించి కేసులు తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. సివిల్ రైట్స్ డే ద్వారా తానే స్వయంగా ఆ ప్రాంతాలలో పర్యటించి ఆ ప్రాంత సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. ఈ సమావేశంలో ఎస్పీతో పాటు, అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు

నియోజకవర్గ స్థాయి పోటీలకు పలు జట్లు ఎంపిక

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల స్థాయిలోని గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో పుట్టపర్తి మండలానికి చెందిన పలుజట్లు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఇఒ బొల్లి ప్రసాద్ పేర్కొన్నారు. పుట్టపర్తి ఉన్నత పాఠశాలలో 21, 23 తేదీల్లో వివిధ జట్ల మధ్య పోటీల నిర్వహించామన్నారు. ఈ పోటీలలో వాలీబాల్‌లో పెడపల్లి, కబాడీ పుట్టపర్తి, ఖోఖోలో వెంగళమ్మ చెరువు, బ్యాట్మింటన్ పుట్టపర్తి, ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చి నియోజకవర్గస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, రమేష్ బాబు, రామకృష్ణ, సుజాత, సుధామణి, పీడీలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి ఆలయంలో శాసనాల పరిశీలన

ఆలయంలో శాసనాలు పరిశీలిస్తున్న చరిత్రకారులు, తదితరులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

శ్రీ సత్య సాయి జిల్లా కదిరి లక్ష్మీనరసింహాలయంలోని పలు శాసనలను చరిత్రకారులు మైనాస్వామి, కె.ఆర్.నరసిం హన్, ధనపాల్ సోమవారం పరిశీలించారు. శాసనాల ద్వారా గుడి చరిత్రను ఆలయ అధికారి శ్రీనివాస్ రెడ్డికి మైనాస్వామి వివరించారు.శాసనాల పరిరక్షణకు తన వంతు కృషిచేస్తామని ఈవో చెప్పారు.ఆలయం తూర్పు రాజ గోపురం ముందున్న అతి పెద్ద దీప స్తంభంపై గల శాసనాన్ని చరిత్రకారులు పరిశీలించారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి రెండో విరూపాక్ష రాయ ప్రతినిధి లక్ష్మణదాస కొడుకు తాండబ సామాన్య శకం 1469లో దీప స్తంభాన్ని నిలబెట్టారని దీప స్తంభం శ్రీ నరసింహ స్వామి ప్రతిరూపమని శాసనం పేర్కొంటున్నట్లు చెప్పారు.కాగా విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహర -బుక్కరాయల కాలంనాటి సంస్కత శాసనాలను చరిత్రకారుడు మైనాస్వామి గుర్తించారు. శాసనాల సంరక్షణలో భాగంగా కదిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో అవగాహన కార్యక్రమాన్ని చరిత్రకారులు నిర్వహించారు. శాసనాలను చదవడం, శాలివాహన శకం నుంచి సామాన్య శకంలోకి తేదీలను మార్చుకోవడం వంటి అంశాలను ఆయన వివరించారు. తూర్పు-పడమర రాజగోపురం ద్వారాల్లో, గుడి దక్షిణ గోడ, తూర్పు ప్రాకారం పై పూర్తిగా చెరిగిపోయిన శాసనాల ఆనవాళ్లను గుర్తించారు. ఆలయాల వెలుపల-లోపలి గోడలను శుభ్రం చేసేటప్పుడు శాసనాలను చెరిపి వేస్తున్నారని చరిత్రకారులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ నిర్మాణాన్ని తెలిపే సామాన్య శకం 1352 నాటి మొదటి బుక్కరాయల శాసనాన్ని మైనాస్వామి చూపించారు. శాసనాలను సంరక్షించుకోవాలని చరిత్రకారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సుబ్బరాజు గుప్త, నాగరాజు, ఆలయ సిబ్బంది, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి రత్న ఆదేశించారు. ఈమేరకు ఆమె సోమవారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 76 మంది ఫిర్యాదులు అందజేయగా వారితో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఫోన్లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, విజయ్ కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి : పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో తన అనుభవంలో ఉన్న భూమిని ఆక్రమించి తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని పెడపల్లి గ్రామానికి చెందిన తిరుపాల్ నాయక్ సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు.పెడపల్లి పంచాయతీ పొలంలో సర్వేనెంబర్ 148-3 లో తన అనుభవంలో గల భూమినిఇదే గ్రామానికి చెందిన కొంతమంది టిడిపి సానుభూతిపరులు ఆక్రమించుకుంటున్నారని అన్నారు. తన పొలంలోని కొబ్బరి చెట్లు,అల్లి నేరేడు చెట్లను పెకిలించి, కాంపౌండ్ కు నాటిన రాతిస్తంభాలను పగలగొట్టి ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భూమినే కాక పక్కన గల పంచాయతీకి చెందిన 17 సెంట్లు సైతం ఆక్రమించినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి నుండి తనకు ప్రాణహాని ఉందని కావున వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఎస్పీకి విన్నవించారు.

బాధిత కుటుంబాలకు తక్షణ సాయం

పోలీసులు విధి నిర్వహణలో చనిపోతే వారి కుటుంబాలకు తక్షణం సహాయం కింద ఇదివరలో 25 వేల రూపాయల అందజేసేవారమని ఇప్పుడు ఒకేసారి లక్ష రూపాయలు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ వి.రత్నను రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం కమిటీ సభ్యులు సూర్యకుమార్, సభ్యులు ఈశ్వరయ్య, గోవిందు, ఏఎస్ఐ చౌకత్ అలీ, తదితరులు కలిసి సమస్యలను వివరించారు. సిబ్బంది విధి నిర్వాహణలో మృతి చెందినప్పుడు అందజేసే తక్షణసాయం గురించి ప్రస్తావించగా స్పందించిన ఎస్పీ లక్ష రూపాయల మొత్తాన్ని ఒకేసారి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలో నెలకొన్న తాగునీటి సమస్య శాశ్వత పరి ష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్డు లోవున్న సత్యసాయి ప్రాజెక్టు సంపును పరిశీలించారు. సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మోటార్ స్విచ్ ఆన్ చేసి మండల కేంద్రానికి తాగునీటిని విడుదల చేశారు. పంపు హౌస్ లో కొన్ని మోటర్లు పనిచేయడం లేదని, పలుచోట్ల మరమ్మతులు కూడా చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను పరిటాల శ్రీరామ్, మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చికెన్ తిరుపాల్,జయచంద్ర, వెంకటేష్, శీన, రామ్మూర్తి, సూరి, రవి తదితరులు పాల్గొన్నారు.

27న ప్రపంచ పర్యాటక దినోత్సవం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా లేపాక్షిలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ చేతన్, ఆర్డీవో భాగ్యరేఖ కోరారు. లేపాక్షిలోని జటాయువు పార్క్ నందు ఈనెల 27 సాయంత్రం 5 గంటల నుండి జిల్లాలోని వివిధ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, తోలుబొమ్మలాటలు, ప్రదర్శన పర్యాటక పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు వారి కుటుంబ సభ్యులతో హాజరుకావాలని ఆమె సూచించారు. జిల్లా పర్యాటకశాఖ తరఫున జిల్లా టూరిజం కౌన్సిల్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సత్యసాయి జిల్లాలో పర్యాటక ప్రదేశాలను మరింత ప్రచారం చేస్తూ పర్యాటకులు ఆకర్షించే విధంగా జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను ఒక బోర్డు రూపంలో పర్యాటక ప్రదేశాల్లో పెట్టాలని జిల్లా టూరిజం శాఖ కు ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా టూరిజం శాఖకు సంబంధించిన బ్రోచర్లను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్, ఆర్డీవో భాగ్యరేఖ, డిఆర్ఒ కొండయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

తూమకుంటలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట గ్రామంలో సర్పంచి రత్నమ్మ ఆధ్వర్యంలో సోమవారం పారిశు ధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్మార్ట్ మీటర్లతో ఆక్రమ వాడటానికి చెక్ పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ రామసురరెడ్డి, స్మార్ట్ మీటర్ జూనియర్ ఇంజనీర్ ఇర్ల రమణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తొలుత స్థానిక ప్రభుత్వ బాలుర వసతిగృహంలో స్మార్ట్ మీటరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ వల్ల విద్యుత్ ఎంత వినియోగిస్తామో అంత మొత్తం మాత్రమే కట్ అవుతుంది అన్నారు, స్మార్ట్ మీటర్ ప్రీపెయిడ్ తరహాలో ఉంటుందన్నారు. తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, రెండో విడతలో కమర్షియల్ దుకాణాలకు ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాయికుమార్, సాయి తేజ్ , హరి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - నంబులపూలకుంట

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండవచ్చునని సిడిపిఒ రాధా అన్నారు. మండలంలోని ఎన్. రెడ్డివారిపల్లిలో పోషణ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవాన్నారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తల్లులు ఆరోగ్యవంతంగా ఉంటేనే పిల్లలు కూడా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నరసమ్మ, లక్ష్మి, అంగనవాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో శ్రీకాకుళం భక్తుల సందడి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

శ్రీకాకుళం జిల్లా నుంచి 3500 మంది భక్తులు పుట్టపర్తికి రెండు రోజులపాటు పర్తియాత్రకి వచ్చారు. సోమవారం చివరి రోజు కావడంతో ప్రత్యేక రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి పట్టణంలోని హనుమాన్ సర్కిల్ నుంచి గోపురం గేట్ వరకు నగర సంకీర్తన నిర్వహించారు. ఈ నగర సంకీర్తనలు శ్రీ సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ప్రారంభించారు. ఇందులో రాధాకృష్ణ, రామ లక్ష్మణ హనుమ, వేషధారణలతో పాటు కోలాటాలు, కళాశాలతో, డప్పు చప్పులతో పుట్టపర్తి పట్టణం హోరెత్తిపోయింది. దాదాపు రెండు గంటల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలతోపాటు దేశ విదేశీ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.